



# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)






Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 05 సంచిక : 141 | ఆదివారం 21 జూన్ 2026 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695


# రైతుకు రూ.26 వేల డిమాండ్


# సుఖీభవపై షర్మిల ఫైర్

- అన్నదాతకు పూర్తి సాయం ఇవ్వాలి
- పీఎం కిసాన్‌తో కలపొద్దన్న డిమాండ్
- ప్రతి రైతుకు రూ.20 వేలే ఇవ్వాలి
- కౌలు రైతులకూ వర్తింపజేయాలి
- 30 లక్షల రైతులు ఎందుకు దూరం?
- హామీ అమలుపై షర్మిల ప్రశ్నలు
- అన్నదాత సుఖీభవపై రాజకీయ వేడి
- రైతులకు అన్యాయం జరిగిందన్న విమర్శ
- సుఖీభవ కాదు.. దుఃఖీభవ: షర్మిల
- రాష్ట్రమే పూర్తి భారం భరించాలి
- రైతు ఖాతాల్లో రూ.7 వేల జమ
- 46.85 లక్షల రైతులకు తొలి విడత
- పథకం అమలుపై కొత్త డిమాండ్
- రైతు సంక్షేమంపై మాటల యుద్ధం



**న్యూస్ డెస్క్, 20 జూన్ (కెరటం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని పీఎం కిసాన్ యోజనతో కలిపి కాకుండా విడిగా అమలుచేయాలని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. కేంద్రంతో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని.. అధికారంలోకి వచ్చాక ఈ విషయంలో మడతపేచీ పెట్టారని షర్మిల విమర్శించారు. తామే ప్రతి రైతుకు 20 వేలు ఇస్తామని, కేంద్రం ఇచ్చేది బోనస్ అని చెప్పి.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చడం రైతులకు చేసిన తీరని అన్యాయమని మండిపడ్డారు. రైతులపై కూటమి ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే., పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 6 వేలను జత చేయకుండా రాష్ట్ర ప్రభుత్వమే ప్రతి రైతుకి 20 వేలు ఇవ్వాలని షర్మిల డిమాండ్ చేశారు. అలాగే కౌలు రైతులకు సైతం అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలని.. లేని పక్షంలో ఇచ్చిన మాట తప్పినందుకు రైతులకు క్షమాపణలు చెప్పాలని షర్మిల డిమాండ్ చేశారు.

మిగతాది 2 లో..




## పోక్సో కేసులో బండి భగీరథ్‌కు బెయిల్




**న్యూస్ డెస్క్, 20 జూన్ (కెరటం న్యూస్):** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పోక్సో కేసు వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో భగీరథ్?కు బెయిల్ మంజూరైంది. నెల రోజులకు పైగా జైల్లో ఉన్న భగీరథ్‌కు తాజాగా మల్కాజిగిరి కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

## బ్లాక్ రెయిన్.. డేంజర్ అలర్ట్స్ జారీ




**న్యూస్ డెస్క్, 20 జూన్ (కెరటం న్యూస్):** రష్యా రాజధాని మాస్కోలో నల్లటి వర్షం కురవడం సంచలనం రేపింది. మాస్కోలోని కీలక ఆయిల్ రిఫైనరీలతో పాటు ఇతర కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ఉక్రెయిన్ గురువారం నాడు వందలాది డ్రోన్లతో దాడికి పాల్పడింది. అయితే, ఈ దాడులు జరిగిన కొన్ని గంటల్లోనే మాస్కో పరిసర ప్రాంతాల్లో నల్లటి వర్షం కురవడం అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతోంది.

దాడుల అనంతరం భయానక పరిస్థితులు

ఉక్రెయిన్ వైమానిక దాడుల తర్వాత కురుస్తున్న ఈ వర్షం సాధారణ నీటి వర్షం కాదని, ఇదొక రకమైన నల్లటి బూడిదతో కూడిన కలుషిత వర్షమని స్థానికులు చెబుతున్నారు. బ్లాక్ రెయిన్ కారణంగా ప్రజల్లో తీవ్రమైన తలనొప్పి, శ్వాసకోశ సమస్యలు తలెత్తుతున్నాయి. నగరంలోని నివాస భవనాలు, రోడ్లపై ఆపి ఉంచిన వాహనాలపై నల్లటి మచ్చల దట్టంగా పేరుకుపోతున్నాయి.కాగా ఇటువంటి రసాయన బూడిద వర్షాలు పర్యావరణానికి, మానవాళికి అత్యంత ప్రమాదకరమని స్థానిక వాతావరణ శాఖ స్పష్టం చేసింది.

## చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడు.. ప్రశంసల వర్షం కురిపించిన బాబా రాందేవ్




**న్యూస్ డెస్క్, 20 జూన్ (కెరటం న్యూస్):** ప్రపంచ యోగా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఉండవల్లి గుహల వద్ద రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ వేడుకకు యోగా గురుగా పేరొందిన గురు రాందేవ్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఎం చంద్రబాబు నాయుడు హాజరయ్యారు.

## సవాలే లేదు బట్టలిప్పి పరుగెత్తిస్తా

### కేటీఆర్ పై మైనంపల్లి సెన్సేషనల్ కామెంట్స్




**న్యూస్ డెస్క్, 20 జూన్ (కెరటం న్యూస్):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇష్టారాజ్యంగా మాట్లాడితే కుదరదని, బిడ్డా కాస్కో.. మీకు ముందు ముందు ఇంకా చాలా సినిమా చూపిస్తామని మాజీ ఎమ్మెల్యే, మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్ చార్జి మైనంపల్లి హనుమంతరావు హెచ్చరించారు. కేటీఆర్ విపక్షంలోనూ అట్టర్ ఫ్లాప్ అయ్యారని, కేటీర్ ప్రతిదానికి ఎందుకు అంతలా ఉలిక్కిపడుతున్నావ్ అంటూ ప్రశ్నించారు.గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. నిన్న మల్కాజిగిరి నియోజకవర్గం పర్యటన సందర్భంగా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు ఘాటుగా స్పందించారు.

## పవన్ కల్యాణ్ ముసుగులో తెలంగాణలో బీజేపీ ప్లాన్: మహేశ్ కుమార్ గౌడ్

**న్యూస్ డెస్క్, 20 జూన్ (కెరటం న్యూస్):** పవన్ కల్యాణ్ ను బూచిగా చూపెట్టి తెలంగాణలో బీజేపీ పాగా వేయాలని చూస్తోందని కానీ తెలంగాణలో బీజేపీకి స్థానం లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. రాష్ట్రంలో మళ్ళీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. అధికారంలో శాశ్వతంగా ఉండటం కోసం ఎంత దూరమైన వెళ్తున్నారని బీజేపీ చెప్పిందే రాజ్యాంగం అనేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రాంతీయ పార్టీలను చీల్చుతున్నారని ఆరోపించారు. యూనివర్సిటీల్లోకి దూరి బీజేపీ రఘుపతి రాజారాం పేరును మరిచిపోయి గాడ్సే జపం చేస్తోందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. గాడ్సే రాజ్యం స్థాపించాలని వ్యూహంతో సొంత ఎజెండాను తీసుకొచ్చి జనాలపై రుద్దుతున్నారని దుయ్యబట్టారు.

భ్రష్టు పట్టిస్తున్నారు:

ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతున్నారని, 90 శాతం సంపద బీజేపీ నేతల అనునయుల చేతిలో ఉందన్నారు.



# రైతుకు రూ.26 వేల డిమాండ్ సుఖీభవపై షర్మిల ఫైర్

మొదటి పేజీ తరువాయి



"అన్నదాత సుఖీభవ కాదు దుఃఖీభవ. మూడో ఏడాది సైతం రైతులకు మోసమే. పెట్టుబడి సాయాన్ని చంద్రబాబు మొక్కుబడి చేశారు. రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని అరకొర విధింపులతో మమ అనిపిస్తున్నారు. రాష్ట్రంలో 80 లక్షల మంది అర్హత కలిగిన రైతన్నలు ఉంటే, ఈ ఏడాది సైతం ఇస్తున్నది కేవలం 46.86 లక్షల మందికే. ముచ్చటగా 30 లక్షల మంది రైతులకు మళ్లీ ఎగనామమే. తొలి ఏడాది ఎగ్గొట్టారు. రెండో సంవత్సరం రైతులకు కత్తెరేశారు. మూడో యేడు పథకాన్ని నామమాత్రం చేశారు. సుఖీభవను సగం సగం చేశారు." అని షర్మిల విమర్శించారు.

కూటమి ప్రభుత్వం పంట నష్ట పరిహారాన్ని ఎగ్గొట్టిందని.. మద్దతు ధరలకు మంగళం పాడిందని షర్మిల మండిపడ్డారు. పంట భీమాకి ధీమా లేకుండా చేశారని.. ఎరువులు ఇవ్వకుండా రైతులను అరిగోస పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్డులు ఇస్తామని చెప్పి 30 లక్షల మంది కౌలు రైతులను కకావికలం చేశారన్న షర్మిల.. కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని దండగ చేసిందని మండిపడ్డారు.

మరోవైపు అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద 2026-27 సంవత్సరానికి సంబంధించిన తొలివిడత సాయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 మంది రైతుల ఖాతాల్లో రూ.3,125.47 కోట్లు జమ చేయనుంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.2,342.92 కోట్లు కాగా... కేంద్ర ప్రభుత్వం వాటా రూ.782.55 కోట్లు. అర్హులైన రైతులు ఒక్కొక్కరికీ రూ.7 వేలు చొప్పున జమ చేయనున్నారు.

# సాయికృష్ణ మిస్సింగ్ కేసు: కృష్ణలంక శ్మశాన వాటికలోనే దహనం?

**న్యూస్ డెస్క్, 20 జూన్ (కెరటం న్యూస్):** రౌడీ షీటర్ సాయికృష్ణ మిస్సింగ్ కేసు దర్యాప్తులో ఏసీపీ దైవప్రసాద్ టీమ్ వేగం పెంచింది. శనివారం ఉదయం కృష్ణలంక శ్మశాన వాటిక సిబ్బంది నుంచి గత నెలాఖరులో దహనం చేసిన అనాథ శవాల వివరాలను సేకరించారు. శ్మశాన వాటిక రికార్డులను పరిశీలించి, అందులో ఉన్న వివరాలను పోలీసులు సేకరించారు. సాయికృష్ణను పోలీసులే హత్య చేసి.. మృతదేహాన్ని దహనం చేశారన్న ఆరోపణల నేపథ్యంలోనే కృష్ణలంక పోలీసులు శ్మశానవాటిలో ఎంక్వైరీ చేశారు. మే 23, 24, 25 తేదీల్లో దహనం చేసిన అనాథ శవాల వివరాలను ఆపరేటర్ రవిని అడిగి తెలుసుకున్నారు. మే 23న సాయంత్రం బస్టాండ్ వద్ద నుంచి ఒక అనాథ శవం రాగా.. 24న పోలీసుల నుంచి లేఖ వచ్చిందని, 25న ఆ డెడ్ బాడీని దహనం చేశామన్నారు. సాధారణంగా అనాథ మృతదేహాలు శ్మశాన వాటికకు వస్తే.. పోలీసుల నుంచి క్లియరెన్స్ లెటర్ వచ్చాక దానికి అంత్యక్రియలు నిర్వహిస్తామన్నారు. అయితే ఆపరేటర్ రవి చెప్పిన వివరాల ప్రకారం.. మే 24,25 తేదీల్లో ఆ శ్మశానవాటికకు నాలుగు డెడ్ బాడీలు రాగా.. ఆ నాలుగు ఎవరివన్న వివరాలు తెలియాల్సి ఉంది. ఆ నాలుగు మృతదేహాల అస్తికల ద్వారా డీఎన్ఏ పరీక్షలు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. కానీ దాదాపు మృతదేహాలను దహనం చేసి నెలరోజులు కావస్తుండటంతో.. ఈ రిపోర్టులో కచ్చితమైన రిజల్ట్ వచ్చే అవకాశాలు చాలా తక్కువే ఉంటాయి.

# స్కిన్ కేర్ క్రీమ్స్, యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్‌పై కేంద్రం నిషేధం



**న్యూస్ డెస్క్, 20 జూన్ (కెరటం న్యూస్):** దేశంలో ప్రజా ఆరోగ్యాన్ని రక్షించేందుకు కేంద్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మానవ వినియోగం కోసం తయారు చేసే 16 రకాల ఫిక్స్డ్ డోస్ కాంబినేషన్ మందుల తయారీ, అమ్మకాలు, పంపిణీ, సరఫరాపై తక్షణమే అమల్లోకి వచ్చేలా కేంద్రం నిషేధం విధించింది. ఈ ఔషధాల వల్ల ట్రీట్మెంట్ పరంగా ఎలాంటి ప్రయోజనాలు లేవని, వీటి వల్ల జరిగే నష్టంతో పోలిస్తే.. ప్రయోజనం ఏమాత్రం లేదని కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. రోగుల భద్రతను పెంపొందించడం, వైద్యశాస్త్రపరంగా ధృవీకరించిన సమర్థవంతమైన మందులు మాత్రమే అందుబాటులో ఉండేలా చూడటం కోసం.. ఈ కఠినమైన చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం పేర్కొంది.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డు ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ.. ఈ మందులను తయారు చేసే మిశ్రమాలపై సమగ్ర సమీక్ష నిర్వహించింది. పలు మందుల తయారీల్లో వాడే డ్రగ్ కాంబినేషన్ తప్పుగా, హానికరంగా ఉన్నట్లు తేలడంతో.. డ్రగ్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ 1940లోని సెక్షన్ 26ఏ కింద కేంద్రప్రభుత్వం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. కేంద్రం బ్యాన్ చేసిన వాటిలో స్కిన్ కేర్ క్రీమ్స్, పెయిన్ కిల్లర్స్, కడుపునొప్పి మాత్రలు, కొన్నిరకాల యాంటిబయాటిక్స్ కూడా ఉన్నాయి. ముఖ్యంగా నిషేధించిన మందుల్లో అసిటైల్ సాలిసిలిక్ యాసిడ్‌తో ఎథోహెప్టాజైన్; డిసైక్లోమైన్, పారాసిటమాల్, క్లిడినియం బ్రోమైడ్ : గ్లిక్లాజైడ్ తో కోమియం పికోలినేట్, పారాసిటమాల్ కాంబినేషన్ తో లిగ్నోకైన్ వంటివి ఉన్నాయి. వీటితో పాటు అమోక్సిసిలిన్, సెర్రాటియోపెప్టిడేస్ మరియు లాక్టోబాసిల్లస్ స్పోరోజెనెస్ వంటి యాంటీబయాటిక్ మిశ్రమాలను కూడా ప్రభుత్వం నిషేధించింది. అలాగే విటమిన్ ఈ, జోజోబా ఆయిల్, టీ ట్రీ ఆయిల్, అలోవెరా వంటి పదార్థాలతో కూడిన కొన్ని స్కిన్ కేర్ క్రీమ్స్ ను బ్యాన్డ్ లిస్టులోకి చేర్చారు. దేశవ్యాప్తంగా ఈ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని పేర్కొంటూ రాష్ట్ర డ్రగ్ కంట్రోలర్లు, ఎన్ఫోర్స్ మెంట్ సంస్థలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.

# దేశంలో వరుస బాంబు పేలుళ్లు.. ఏడుగురు మృతి

**న్యూస్ డెస్క్, 20 జూన్ (కెరటం న్యూస్):** పాకిస్తాన్‌లోని వాయవ్య ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రాంతంలో శనివారం జరిగిన రెండు వేర్వేరు బాంబు పేలుళ్ల లో కనీసం ఏడుగురు మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దుకు ఆనుకుని ఉన్న ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రాంతంలోని బన్ను జిల్లాలో ఈ దారుణం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న ఒక ప్రైవేట్ పికప్ ట్రక్కును లక్ష్యంగా చేసుకుని తీవ్రవాదులు మొదట రిమోట్ కంట్రోల్డ్ ఐఈడీ ద్వారా దాడికి పాల్పడ్డారని బన్ను జిల్లా పోలీసు అధికారి యాసిర్ అఫ్రిది తెలిపారు.

మొదటి పేలుడు సంభవించిన వెంటనే స్థానికులు స్పందించి, తీవ్రంగా గాయపడిన వారిని అత్యవసర చికిత్స కోసం ఒక కారులో ఆసుపత్రికి తరలిస్తుండగా.. కాసేపటికే మార్గమధ్యంలో రెండవ ఐఈడీ బాంబు పేలింది. ఈ రెండు దాడులలో మొదటి పేలుడుకు ఐదుగురు, రెండవ పేలుడుకు ఇద్దరు చొప్పున మొత్తం ఏడుగురు అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దాడులకు తామే బాధ్యులమని ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ అధికారికంగా ప్రకటించనప్పటికీ, గతంలో ఇలాంటి దాడులకు పాల్పడిన పాకిస్తానీ తాలిబాన్ (టెహ్రీక్-ఎ-తాలిబాన్ పాకిస్థాన్ – టీటీపీ) పైనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# తెలంగాణలో 'సర్' ప్రక్రియపై బిగ్ అప్‌డేట్.. కొత్త ఓటర్ల నమోదుపై క్లారిటీ

మొదటి పేజీ తరువాయి




ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా సమగ్రంగా, పారదర్శకంగా రూపొందించేందుకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ -2026 ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బూత్ లెవల్ ఆఫీసర్లు, బూత్ లెవల్ ఏజెంట్లకు ఇప్పటికే పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఇవాళ హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో చేపట్టిన 'సర్'పై వివరాలను వెల్లడించారు.

కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 25 నుంచి బీఎల్వోలు తమ పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని వెల్లడించారు. జులై 25వ తేదీలోపు ఎన్యుమరేషన్ సమర్పించాలని, కొత్త ఓటర్లు తమ ఓటు హక్కును అదే ఫారంలో నమోదు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు. చాలా చోట్ల 80 శాతం మ్యాపింగ్ పూర్తి చేశామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన పత్రాలను కూడా అనుమతిస్తామని, 2002లో అనుసంధానమైన వారికి ఇతర పత్రాలు అవసరం లేదని స్పష్టం చేశారు. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురించే వరకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం అన్ని కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తుందని హామీ ఇచ్చారు. ఇప్పటికే డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా నియమించుకుంటున్నట్లు తెలిపారు. బీఎల్వోలు తీసుకొచ్చే ఫామ్‌లను ముసాయిదాలో పొందుపరుస్తున్నామని వెల్లడించారు. రాజకీయ పార్టీలతో సమావేశాలు ఏర్పాటు చేయాలని అధికారులకు చెప్పామన్నారు.

# రెండేళ్లు ధైర్యంగా బ్రతకండి, మళ్లీ కేసీఆర్ వస్తాడు: కేటీఆర్



**న్యూస్ డెస్క్, 20 జూన్ (కెరటం న్యూస్):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం పొన్న గ్రామంలో పర్యటించారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు నుగూరే పాండురంగ్ కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు కురిపించారు. రైతు కుటుంబానికి ధైర్యం చెప్పండని కేసీఆర్ తమను ఇక్కడికి పంపించారని అన్నారు. రెండేళ్లు దయచేసి ధైర్యంగా బ్రతకండి, మళ్లీ కేసీఆర్ వచ్చి మిమ్మల్ని కళ్ళలో పెట్టుకుని చూసుకుంటామని చెప్పమ్మన్నాడని తెలిపారు. పంట కొనలేదని రైతు విషం తాగి పడిపోతే ఒక్క అధికారి కూడా పట్టించుకోలేదని మండిపడ్డారు.

రాష్ట్రంలో ఉన్న ప్రతి రైతు పరిస్థితి ఇదేనని అన్నారు. పాండురంగ్ కుటుంబానికి కనీసం రుణమాఫీ కాలేదు, రైతుబంధు కూడా పడటం లేదని చెప్పారు. చనిపోయిన ప్రతీ రైతుకి కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కుటుంబంలో చదువుకున్న పిల్లలు ఉంటే వాళ్ళకి తప్పకుండా ఉద్యోగం ఇవ్వాలని అన్నారు. ధాన్యం కొనక, లంచం సిస్టం పెట్టి, కనీసం మార్కెట్ యార్డులో నీళ్లు కూడా లేవని విమర్శించారు. కాబట్టి ఇవన్నీ ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. నిజంగానే ధాన్యం కొనడంలో ప్రభుత్వం రికార్డ్ సృష్టించి ఉంటే పాండురంగ్ అనే రైతు ఎందుకు చనిపోయాడని ప్రశ్నించారు. కరోనా సమయంలో కూడా తాము 8500 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసామని, ప్రభుత్వం చెప్పే మాటలు నమ్మవద్దని అన్నారు. కావాలంటే కొనుగోలు కేంద్రాల దగ్గరికి వెళ్లి అడగాలని సూచించారు.

# పోక్సో కేసులో బండి భగీరథ్‌కు బెయిల్

మొదటి పేజీ తరువాయి



అరణ్య ఫాంహౌస్‌లో సీన్ రీకన్‌స్ట్రక్షన్: కాగా, ఓ మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడన్న ఆరోపణలతో బండి బగీరథ్‌పై గత మే 8వ తేదీన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. నాటకీయ పరిణామాల మధ్య ఈ కేసు విచారణాధికారి కూకట్ పల్లి డీసీపీ రితిరాజ్ ఆదేశాలతో 5 బృందాలుగా రంగంలోకి దిగిన పోలీసులు మే 16న భగీరథ్ ను అరెస్ట్ చేసి చర్లపల్లి జైలుకు రిమాండ్ ఖైదీగా తరలించారు. ఈ కేసు దర్యాప్తులో మరిన్ని కీలక ఆధారాలు సేకరించేందుకు పోలీసులు తమ కస్టడీకి అప్పగించాలని కోర్టును ఆశ్రయించగా మల్కాజిగిరి కోర్టు 3 రోజుల కస్టడీకి అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఆయన్ను కస్టడీకి తీసుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు చర్లపల్లి జైలు నుంచి తమ అదుపులోకి తీసుకుని మొయినాబాద్ లోని అరణ్య ఫామ్ హౌస్‌కు భగీరథ్‌ను తీసుకువెళ్లారు. అక్కడ సీన్ రీ కన్ స్ట్రక్చన్ నిర్వహించారు. ఈక్రమంలో భగీరథ్ దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్ పై విచారణ జరిపిన మల్కాజిగిరి కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది.

# చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడు.. ప్రశంసల వర్షం కురిపించిన బాబా రాందేవ్

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా.. బాబా రాందేవ్.. సీఎం కు వివిధ రకాల యోగా ప్రక్రియలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు నాయుడు ఈ వయస్సులో కూడా ఎంతో ఆరోగ్యంగా ఉన్నారని కొనియాడారు. అభివృద్ధి, విజన్ కలిగిన సీఎం అంటూ.. కితాబిచ్చారు. ప్రధాని నరేంద్రమోడీ వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా.. సీఎం పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్ కోసం ప్రధాని మోదీ కృషి చేస్తోంటే.. భారత్ ను విశ్వగురుగా నిలపాలన్న ప్రధాని కృషికి చంద్రబాబు తోడయ్యారన్నారు. చంద్రబాబు తరహాలో ప్రతి సీఎం పనిచేస్తే వికసిత్ భారత్ 2047 లక్ష్యం ముందుగానే సాకారమవుతుందని బాబా రాందేవ్ ఆశించారు. దేవతల రాజధాని అమరావతి.. ఇప్పుడు యోగా రాజధాని అయిందన్నారు. చంద్రబాబు ప్రకృతి, సాంస్కృతిక, యోగా ప్రేమికుడు మాత్రమే కాదని, ఆయన సర్వజన ప్రేమికుడని ప్రశంసించారు.

సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. యోగా సాధనతో రాందేవ్ బాబా అద్భుతాలు సృష్టిస్తున్నారని కొనియాడారు. రాందేవ్ బాబా శిక్షణలో యువత చేస్తున్న యోగాసనాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని, యోగాకు మంచి గుర్తింపు తీసుకొచ్చింది రాందేవ్ బాబానే అన్నారు. ప్రస్తుత సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందని, ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరమని సీఎం పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా 190 దేశాలు యోగాను అనుసరిస్తున్నాయన్నారు. త్వరలో దేశానికి ఆధ్యాత్మిక హబ్ గా ఏపీ మారనుందని తెలిపారు. పర్యవరణ పరిరక్షణ, కాలుష్య నివారణ కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని, రాష్ట్రంలో 50 శాతం పచ్చదనాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

# సవాలే లేదు బట్టలిప్పి పరుగెత్తిస్తా.. కేటీఆర్ పై మైనంపల్లి సెన్సేషనల్ కామెంట్స్

మొదటి పేజీ తరువాయి



ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పనులను అడ్డుకోవమే కేటీఆర్, హరీశ్ రావు పనిగా పెట్టుకున్నారని ధాన్యం సేకరణ విషయంలో ఈ ఇద్దరూ లారీలను అడ్డుకున్నారని ఆరోపించారు. అమెరికా నుంచి నేరుగా వచ్చి పదవులు అనుభవిస్తున్న కేటీఆర్ సిరిసిల్ల ఉద్యమాకారుడి నోట్లో మట్టికొట్టాడని విమర్శించారు.

సెలబ్రిటీల జీవితాలను నాశం చేశావ్:

కేటీఆర్ దండుపాళ్యం బ్యాచ్ అని మాట్లాడుతున్నాడు.. దండుపాళ్యం బ్యాచ్, స్టూవర్టుపురం దొగలకైనా మినిమం ఎథిక్స్ ఉంటాయి. మీకులా వారు సొంత చెల్లి, బావ, రాజకీయ నాయకుల ఫోన్లను ట్యాపింగ్ చేయించరని, కేటీఆర్ సెలబ్రెటీల ఫోన్లు ట్యాప్ చేసి వారి జీవితాలను నాశనం చేశాడని ఆరోపించారు. మేం రౌడీయిజం చేసేటోళ్లం కాదని రౌడీలకు బుద్ధి చెబుతూ హీరోయిజం చేసేటోళ్లం అన్నారు. సవాలే లేదని బట్టలిప్పి పరుగెత్తిస్తామన్నారు. మైనంపల్లి మాటల మనిషి కాదని చేతల మనిషి అని చెప్పారు. మల్కాజిగిరికి వస్తానంటున్నావ్ నేను సిరిసిల్లాకు రాలేనా అని ప్రశ్నించారు.

అర్ధరాత్రి పోలీసులకు దొరికిన చరిత్ర నీది:

మంత్రి హోదాలో గన్ మెన్లు ఎవరూ లేకుండా అర్ధరాత్రి ఒంటరిగా వెళ్తుండగా అప్పా జెంక్షన్?లో ముఖానికి మాస్క్ పెట్టుకుని దొరికిన ఘనత కేటీఆర్ ది అని సంచలన ఆరోపణలు చేశారు. ఈ విషయాన్ని పోలీసు డిపార్ట్ మెంట్ చర్చించుకుందన్నారు. మేము దొంగతనం చేయడం లేదని హీరోయిజం చేస్తున్నామని, ప్రజలకు సేవ చేస్తున్నామన్నారు. ప్రభుత్వంలో ఉన్నామనే ఓపికతో వెళ్తున్నామని అదే మేము తలుచుకుంటే ఒక్క రోజు కూడా నిద్రపోలేవని ఫైర్ అయ్యారు. ఇంగ్లీశ్ మాట్లాడటంలో కేటీఆర్ తనకు తానే తోపు అనుకుంటున్నాడని కానీ మెజారిటీ మంత్రుల్లో ఆయనకంటే మంచి ఇంగ్లీశ్ మాట్లాడేవారు ఉన్నారన్నారు.

# పవన్ కల్యాణ్ ముసుగులో తెలంగాణలో బీజేపీ ప్లాన్: మహేశ్ కుమార్ గౌడ్

మొదటి పేజీ తరువాయి



ఆర్ఎస్ఎస్ భావాలు గల వ్యక్తులు యూనివర్సిటీల్లో దూరి వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని హాట్ కామెంట్స్ చేశారు. బార్డర్‌లో చైనా భారత భూభాగంలోకి చొచ్చుకొస్తా ఉంటే బీజేపీ ఆ విషయం మాట్లాడటం లేదన్నారు. రాహుల్ గాంధీ లోక్ సభలో ఈ విషయాన్ని ఫోటోలతో సహా చూపించారన్నారు. గాంధీ కుటుంబం త్యాగ మూర్తుల కుటుంబం అని నెహ్రూ,గాంధీ గురించి అసత్యాలు ప్రచారం చేస్తున్నారన్నారు. దేశం కోసం ఇందిర గాంధీ, రాజీవ్ గాంధీ ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు.

ఆయన్ను ఉరి తీసినా తప్పులేదు:

మీనాక్షి నటరాజన్ నామినేషన్ విషయంలో దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని అసలు కేసు లేకుండా నామినేషన్ రిజెక్ట్ చేసిన రిటర్నింగ్ ఆఫీసర్ ను ఉరి తీసినా తప్పులేదన్నారు. జార్ఖండ్?లో అంబానీ తరపు వ్యక్తికి సరైన పత్రాలు లేకున్నా మరోసారి అవకాశం ఇచ్చారని ఆరోపించారు. దేవుడు పేరు చెప్పకుండా బీజేపీ నేతలు గెలిచే దమ్ముందా? అని ప్రశ్నించారు. ఉదయం లేస్తే దేవుడి పేరు జపం చేస్తారన్నారు. లౌకిక వాదం ఉన్న వారి ఓట్లు తొలగించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

# సింగరేణి సమస్యలపై కవిత సంచలన వ్యాఖ్యలు



**న్యూస్ డెస్క్, 20 జూన్ (కెరటం న్యూస్):** సింగరేణి సమస్యలపై తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. నేడు కవిత భూపాలపల్లి జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. సింగరేణి అధికారుల పీఆర్పీ చెల్లింపునకు డిప్యూటీ సీఎం లంచం అడుగుతున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వంలో అంతలా అవినీతి పెరిగిపోయిందని అన్నారు. నిషేధిత డిటోనేటర్ల కొనుగోలు, కారుణ్య నియామకాలు, మెడికల్ బోర్డు లాంటి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఈ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వానికి జూలై 20 వరకు డెడ్ లైన్ విధించారు. ఏ మైన్‌కు వెళ్లినా రెండు ప్రధాన సమస్యలు కనిపిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం సింగరేణికి ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వకపోవడం వల్ల సంస్థ నష్టాల్లో కూరుకుపోయి కార్మికులకు ఇవ్వాల్సిన పనిముట్లు ఇవ్వడంలేదన్నారు. దానివల్ల కార్మికుల భద్రతకు ముప్పు కలుగుతోందని వ్యాఖ్యానించారు. కార్మికులకు హక్కుగా ఉన్న కారుణ్య నియామకాలను ఇవ్వడంలేదని విమర్శించారు. కార్మికుల హక్కుల గురించి వెనకడుగు వేసే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సింగరేణిలో కనీసం మంచినీరు, ఆక్సీజన్ ఇవ్వలేదని పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు.

# బ్లాక్ రెయిన్.. డేంజర్ అలర్ట్స్ జారీ

మొదటి పేజీ తరువాయి



హెచ్చరికలు జారీ

పరిస్థితి తీవ్రతను గమనించిన మాస్కో నగర అధికారులు ప్రజలకు పలు కీలక సూచనలు జారీ చేశారు. నల్లటి వర్షం కురుస్తున్నందున ప్రజలెవరూ ఇళ్ల నుంచి బయటకు రాకూడదని, తలుపులు, కిటికీలు పూర్తిగా మూసి ఉంచాలని ఆదేశించారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, ఆస్తమా వంటి ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్నవారు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఎమెర్జెన్సీ అలర్ట్స్ జారీ చేశారు.

4 ఎయిర్పోర్టులు మూసివేత.. 500 పైగా విమానాలు రద్దు

రష్యాపై జరిగిన అతిపెద్ద డ్రోన్ దాడి కావడంతో మాస్కోలో తీవ్ర ఆందోళన నెలకొంది. భద్రతా కారణాల దృష్ట్యా మాస్కో నగర పరిధిలోని విమానాశ్రయాలన్నింటినీ అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. ఎయిర్‌పోర్టుల మూసివేత కారణంగా అంతర్జాతీయ, దేశీయ రూట్లకు సంబంధించిన దాదాపు 500కు పైగా విమాన సర్వీసులు పూర్తిగా రద్దయినట్లు రష్యా అధికారులు అధికారికంగా ప్రకటించారు.

# నినాదాల నుంచి నిజమైన ఆచరణ వైపు

# 2047 నాటికి విశ్వగురువుగా భారత్

## అట్టడుగు వర్గాల అభ్యున్నతే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం

## రైతన్నకు రక్ష.. దేశానికి శ్రీరామరక్ష

## మాజీ ఎమ్మెల్సీ ఎండల లక్ష్మీనారాయణ

## ఖమ్మం సంకల్ప సమ్మేళనంలో దార్శనిక ప్రసంగాలు




**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్:** ఒకప్పుడు దస్త్రాలకు, నినాదాలకే పరిమితమైన ప్రజా సంక్షేమం.. గత పన్నెండేళ్ల పాలనలో నిజమైన ఆచరణకు నోచుకుందని, 2047 నాటికి భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా ప్రభుత్వ 'వికసిత భారత్' బృహత్తర సంకల్పం తీసుకుందని మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ నాయకులు ఎండల లక్ష్మీనారాయణ ఉద్ఘాటించారు. ఖమ్మం నగరంలో శనివారం నగరంలోని ప్రముఖ కావేరి రిసార్ట్స్ వేదికగా "12 సంవత్సరాల వికాసం, ప్రజా సంక్షేమం.. వికసిత భారత్ సంకల్ప సమ్మేళనం" బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ ప్రతిష్టాత్మక సమ్మేళనానికి సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ ఎండల లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.దేశ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా మౌలిక సదుపాయాల కల్పన, రైతుల ఆదాయ పెంపు నుంచి మహిళా సాధికారత వరకు కనీవినీ ఎరుగని రీతిలో సాధించిన ఈ సువర్ణ ప్రగతిని ప్రతి పేదవాడి గడపకు చేర్చాల్సిన బాధ్యత కార్యకర్తల భుజస్కంధాలపైనే ఉందని ఆయన అన్నారు. ఈ పన్నెండేళ్ల కాలం దేశ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుందని అభివర్ణించారు. సాహసోపేతమైన నిర్ణయాలు, పారదర్శక పాలన కారణంగా భారతదేశం నేడు ప్రపంచ దేశాల ముందు సగర్వంగా తలెత్తుకుని నిలబడిందని ఆయన గర్వంగా చెప్పారు. కోట్లాది మంది భారతీయుల ఆకాంక్షలకు ప్రతిరూపమైన 'వికసిత భారత్' కలను సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. సరిగ్గా ఇదే వేదికపై వ్యవసాయ రంగంలో కేంద్రం తీసుకొచ్చిన సమూల మార్పుల గురించి పలువురు వక్తలు గణాంకాలతో సహా సవివరంగా ప్రజల ముందుంచారు. 2013–14 నాటి పరిస్థితులతో పోలిస్తే నేడు పంటల కనీస మద్దతు ధరలు (ఎంఎస్పీ) రికార్డు స్థాయిలో పెరిగాయని సభలో స్పష్టం చేశారు. ఒకప్పుడు రూ.1,310 ఉన్న సాధారణ రకం వరి ధర ఇప్పుడు రూ.2,441కి చేరిందని, ఏ–గ్రేడ్ వరి ధర రూ.1,345 నుంచి రూ.2,461కి, జొన్నల ధర రూ.1,500 నుంచి ఏకంగా రూ.3,699కి పెరగడం వ్యవసాయ రంగానికి కేంద్రం ఇస్తున్న ప్రాధాన్యతను స్పష్టం చేస్తోందని వారు విశ్లేషించారు. వాణిజ్య పంటలైన పత్తి (షార్ట్ స్టైపుల్) ధర రూ.3,700 నుంచి రూ.8,268కి, పప్పు దినుసులైన పెసలు, మినుములు, కందుల ధరలు సైతం ఊహించని రీతిలో వృద్ధి చెందడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని హర్షం వ్యక్తం చేశారు. మద్దతు ధరల పెంపుతో పాటుగా రైతుల పెట్టుబడి భారాన్ని తగ్గించేందుకు కేంద్రం తీసుకుంటున్న చారిత్రక నిర్ణయాలను నాయకులు కొనియాడారు. దళారీ వ్యవస్థను పూర్తిగా పారద్రోలుతూ, 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లోకే ఆర్థిక సాయాన్ని జమ చేస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయంగా యుద్ధాలు, ఇతర ఉద్రిక్త పరిస్థితుల వల్ల ద్రవ్యోల్బణం భయపెడుతున్నా, దేశంలో యూరియా బస్తా ధరను కేవలం రూ.266.50 వద్దే స్థిరంగా ఉంచగలిగామని గుర్తుచేశారు. అలాగే 50 కిలోల డీఏపీ బస్తాపై రూ.1,665 మేర సబ్సిడీని కేంద్రమే భరిస్తోందని, ప్రభుత్వ జోక్యం లేకపోతే మార్కెట్లో దీని ధర రూ.4,000 దాటిపోయి రైతుల నడ్డి విరిచేదని ఆందోళన వ్యక్తం చేశారు. పటిష్టమైన విదేశీ విధానం, ముందుచూపుతో కూడిన ప్రణాళికల ద్వారానే దేశంలో ఎరువుల కొరత లేకుండా సరఫరా వ్యవస్థను కాపాడుకోగలిగామని వక్తలు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి నంబూరి రామలింగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు సన్నీ ఉదయ ప్రతాప్, సీనియర్ నాయకులు వక్కలంక సుబ్రహ్మణ్యం, విజయ రాజు, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# త్రివేణిలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు




**ఖమ్మం ఎడ్యుకేషన్, కెరటం న్యూస్:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఖమ్మంలోని త్రివేణి పాఠశాల ఆధ్వర్యంలో శనివారం పాఠశాల ప్రాంగణంలో ఘనంగా యోగా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆరోగ్యం, ఏకాగ్రత, మానసిక ప్రశాంతత పెంపొందించడమే లక్ష్యంగా ప్రతి సంవత్సరం ఈ యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ "యోగ" భారతదేశం ప్రపంచానికి అందించిన ఒక గొప్ప వరం అని,యోగ ద్వారా ఒక ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు.ఎక్కువ పగటి సమయం ఉన్న రోజు జూన్ 21 కావటం వలన,ఈ ప్రత్యేకతని పురస్కరించుకుని ఈ రోజుని అంతర్జాతీయ యోగా దినోత్సవం గా జరుపుకోవాలని 2014, సెప్టెంబర్ 27 న మన ప్రధాని నరేంద్ర మోడీ ఐక్యరాజ్యసమితి కి సూచించగా, 193 ప్రతినిధులు ఉన్న ఐక్యరాజ్యసమితిలో శాశ్వత సభ్యులుగా ఉన్న దేశాలతో సహా 175 మంది 2014 లో ఆమోదించారు. మొదటి యోగ అంతర్జాతీయ దినోత్సవం 2015, జూన్ 21న జరుపుకున్నారని తెలియజేశారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతి ఒక్కరూ యోగా ని నిత్యజీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో యోగా ట్రైనర్ చైతన్య కిషోర్ పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయుల తో వివిధ యోగాసనాలు, ప్రాణాయామాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగా ప్రదర్శనలు చేసి అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి యోగా యొక్క ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలపై పాఠశాల యాజమాన్యం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ వైస్ ప్రిన్సిపాల్ స్వప్న ముస్తఫా క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్ ట్రాన్స్పోర్ట్ ఇంచార్జ్ సందీప్,ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేశారు.





# పీఎం కిసాన్ సమ్మాన్ పై సదస్సు






**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్:** కృషి విజ్ఞాన కేంద్రం వైరా నందు 23వ విడత పిఎం కిసాన్ సమ్మన్ నిధి ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో, కెవికె వైరా హెడ్ మరియు సీనియర్ శాస్త్రవేత్త మాట్లాడుతూ భూమి సారం తగ్గిపోతుంది మన భూమిని కాపాడుకోవాల్సిన అవసరం, ఆవశ్యకత గురించి, డిజిటల్ అగ్రికల్చర్ మిషన్, పప్పు ధాన్యాలలో ఆత్మ నిర్భర భారత్ ప్రోగ్రాం , తక్కువ రసాయన ఎరువుల వాడకం, మరియు రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మారాలని సూచించారు, శాస్త్రవేత్త పి .ఎస్ . యం. పని శ్రీ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యత, ప్రస్తుతం ఖరీఫ్ లో వేసుకోవాల్సిన వరి మరియు అపరాల రకాల గురించి వివరించడం జరిగింది, వైరా మండల వ్యవసాయ అధికారి, మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల వాడకం వాటి ఆవశ్యకత నేల ఆరోగ్యం గురించి వివరించడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఫ్యాక్ట్ మేనేజర్ నాగార్జున గారు, ఖమ్మం జిల్లా ప్రతినిధి రామకృష్ణ గారు, గొల్లపూడి , గన్నవరం విస్తరణ అధికారులు ఎ. రాజేష్, వెంకట నరస య్య మరియు కె.వి.కె సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# దెందుకూరు గ్రామంలో రైల్వే హద్దులు సర్వే జరిపిన ప్రభుత్వ సర్వేయర్ ఉషారాణి



**మధిర, కెరటం న్యూస్ ప్రతినిధి:** దెందుకూరు గ్రామంలోని రైతుల భూముల్లో అక్రమంగాపాతిన రైల్వే హద్దు రాళ్ళు. దెందుకూరు గ్రామం రెవెన్యూ పరిధిలోని డౌన్లైన్లో రైల్వే వారు పరిధి దాటి రైతులు భూముల్లో రాళ్లు పాతడం జరిగింది. దీనిని ఎప్పటినుండో రైతులు ప్రతి ఒక్క రైల్వే అధికారులు కలిసి వివరించడం జరిగింది. నిన్న మరలా కొంతమంది. రైల్వే కాంట్రాక్టర్లు హద్దు రాళ్లు పాతే క్రమంలో గ్రామంలోని రైతులందరూ వచ్చి. మా భూములు మాకు అప్పజెప్పి మీ భూములు లో రాళ్లు పాదుకోమనటం జరిగినది. రైల్వే వారు మరియు రెవెన్యూ వారు ఇద్దరూ కలిసి సర్వే చేసి మా భూమిలో ఉన్న రాళ్లు తీసివేయాలని. మా పాస్ పుస్తకాల్లో 1965 రైల్వే సేకరించిన భూములు పోను మా భూములు మాకు అప్పజెప్పాలని రైల్వే అధికారులు పనులు నిలిపివేయాలని. జిల్లా కలెక్టర్ ని. మరియు మధిర ఎమ్మార్వో ని కూడా కలిసి మా సమస్య వారి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన వారు. ప్రభుత్వ సర్వేయర్ ఉషారాణి ని పంపి కొన్ని సర్వే నెంబర్లు లో హద్దులు తీసుకోవడం జరిగినది. రైల్వే వారికి కూడా ఈరోజు సర్వే కి వస్తున్నారని తెలియపరచక. వారు సికింద్రాబాద్ డివిజన్ నుండి విజయవాడ డివిజన్ కు మారిన క్రమంలో మేము రాలేకపోతున్నాం. సర్వేయర్ సర్వే జరిపి మాకు కాగితం ఇవ్వాలని కోరినారు. ఈరోజు రైతులు సమక్షంలో. ప్రభుత్వ సర్వేయర్ వచ్చి సర్వే జరిపినారు. మా సమస్య కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన కలెక్టర్ కి మధిర ఎమ్మార్వోకి కృతజ్ఞతలు తెలియజేశారు రైతులు ఈ కార్యక్రమంలో దెందుకూరు గ్రామంలోని రైతులు. చుంచు విజయ్ కుమార్. గుర్రం వెంకట్రావు. అద్దంకి భాస్కరరావు. ఐతం కృష్ణ. కోట శ్రీనివాసరావు. అద్దంకి వెంకట్రావు చెరుకూరు విసిందరావు. ఊట్ల శంకర్రావు. ఎడ్లపల్లి వెంకటేశ్వరరావు. యడ్లపల్లి రామారావు. ఊట్ల రఘు. చావా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మనసుకు ప్రశాంతత , శరీరానికి శక్తి

# 'యోగా'నే జీవితానికి స్ఫూర్తి."

## స్మార్ట్ కిడ్జ్ లో నేత్రపర్వంగా యోగా దినోత్సవం

## కనువిందు చేసిన విద్యార్థుల యోగాసనాలు, సూర్య నమస్కారాలు, ధ్యానం.

## పలు యోగ భంగిమలతో చిన్నారులలో వెల్లివిరిసిన ఆనందోత్సవాలు



**ఖమ్మం ఎడ్యుకేషన్, కెరటం న్యూస్:** స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవ ముందస్తు సంబరాలను శనివారం నేత్రపర్వంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు యోగాసనాలు, సూర్య నమస్కారాలు, ధ్యానం లను నిర్వహించి హుషారుగా గడిపారు. విద్యార్థులు పలు రకాల యోగాసన భంగిమలను వేసి, 12 రకాల సూర్య నమస్కారాలను ప్రదర్శించారు. యోగా గురువు సూచనల మేరకు ధ్యానం ను నిష్టగా నిర్వహించారు. వివిధ రకాల యోగాసన భంగిమలతో పాఠశాల మైదానం కనువిందు చేసింది.ఈ సందర్భంగా యోగాసనాలలో పాల్గొన్న విద్యార్థులను ఉద్దేశించి పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ ప్రపంచానికి మన భారతదేశం ఇచ్చిన గొప్పకానుక యోగ అని తెలిపారు. యోగాసనాలు ప్రతి ఒక్కరిని నిత్యం ఉత్తేజకరంగా ఉంచుతుంది అని తెలిపారు. మానసిక, శారీరక దృఢత్వానికి, మానసిక ప్రశాంతతకు యోగా ధ్యానం ఉపయోగపడతాయని తెలియజేశారు. అనంతరం పాఠశాలలో ఫాదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఒక్కరికి తండ్రి గొప్ప హీరో అని పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య పేర్కొన్నారు. ఫాదర్స్ డే సందర్భంగా విద్యార్థులందరికీ ఫాదర్స్ డే గ్రీటింగ్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# రైతుల పక్షాన నిరంతర పోరాటమే నా ధ్యేయం -మాజీ ఎంపీ నామ

## 17వ లోక్‌సభ ఫ్లోర్ లీడర్‌గా రైతుల సమస్యలపై గళమెత్తాను



**హైదరాబాద్ బ్యూరో, కెరటం న్యూస్:** రైతుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 17వ లోక్‌సభలో బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా రైతుల సమస్యలను పార్లమెంట్ వేదికగా ఎన్నోసార్లు ప్రస్తావించి, వారి హక్కుల కోసం నిరంతరం పోరాటం చేశానని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రైతాంగాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపేలా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశామని ఆయన గుర్తు చేశారు. రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్, కాళేశ్వరం వంటి భారీ సాగునీటి ప్రాజెక్టులు, విస్తృత స్థాయిలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ద్వారా వ్యవసాయాన్ని లాభసాటి రంగంగా మార్చిన ఘనత నాటి కేసీఆర్ ప్రభుత్వానిదేనని తెలియజేశారు. వ్యవసాయం దేశ ఆర్థిక వ్యవస్థ కువెన్నెముక అని, రైతు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. రైతులు ఎదుర్కొంటున్న పంట కొనుగోలు సమస్యలు, గిట్టుబాటు ధరలు, సాగునీటి ఇబ్బందులు, ఎరువులు, విత్తనాల కొరత, విద్యుత్ సమస్యలు వంటి అనేక అంశాలపై కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం ఒత్తిడి తీసుకొచ్చామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రైతుల ఖాతాల్లో నేరుగా పెట్టుబడి సాయం జమ చేసి, రైతు కుటుంబాలకు భరోసా కల్పించి, తెలంగాణను వ్యవసాయ రంగంలో దేశానికి ఆదర్శంగా నిలిపిందన్నారు. ప్రతి పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేసి రైతుకు అండగా నిలవాలనే విధానాన్ని నాడు కేసీఆర్ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసిందని తెలిపారు.

ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్రం నిర్దేశించిన కోటాకు పరిమితం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రతి పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేసి రైతులకు అండగా నిలవాలని కోరారు. రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అవసరమైతే రైతు సంఘాలతో కలిసి బీఆర్ఎస్ పార్టీ మరో ఉద్యమానికి సిద్ధంగా ఉంటుందని, రైతు సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, అన్నదాతకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేసారు.

# స్టూడెంట్ వాయిస్ పేరుతో కేంద్రంపై నిరసనలు

## డీసీసీ అధ్యక్షులు నూతి



**ఖమ్మం టౌన్, కెరటం న్యూస్:** జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన పత్రికా విలేఖరుల సమావేశం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ఏ ఐ సి సి ఆదేశానుసారం టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు స్టూడెంట్ వాయిస్ పేరుతో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ముఖ్యంగా నీట్ పేపర్ లీకేజి పై కేంద్రం ప్రభుత్వం బాధ్యతవహించాలని, లీకేజీ బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని వారి వల్ల లక్షల మంది విద్యార్థులు ఎన్నో కష్టనష్టాల కోర్చి పరీక్ష వ్రాసిన తర్వాత రద్దు కావటం వల్ల విద్యార్థులు, విద్యార్థుల తల్లి దండ్రులు తీవ్ర నిరాశ నిస్పృహలకు గురి అయ్యారని అన్నారు. అదేవిధంగా ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణపై ఎన్నో అపోహలున్నాయి అని కేంద్ర (బి జె పి) ప్రభుత్వం కుటిల రాజకీయ చతురతకు నిదర్శనం అని అన్నారు. అనంతరం జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య మాట్లాడుతూ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పదవీభాధ్యతలు స్వీకరించిన తర్వాత మన ఖమ్మం జిల్లాకు మొట్ట మొదటి సారి విచ్చేయుచున్న సందర్భంగా స్వాగతం పలుకుతూ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సమావేశం 22-06-2026 న సాయంత్రం 3.00 గంటలకు సప్తపది ఫంక్షన్ హాల్ లో కలదు మన ప్రజా పాలన గావిస్తున్న ప్రభుత్వం మహిళల కొరకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని, భవిష్యత్ లో మహిళా శ్రేయస్సు కొరకు మరెన్నో సంక్షేమ పథకాలు చేపట్టనున్నారని అట్టి ప్రభుత్వాన్ని ఆశీర్వదినటానికి జిల్లా లోని నలుమూలల నుండి మహిళా కాంగ్రెస్ నాయకులు,ప్రస్తుత మాజీ ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమమును జయప్రదం చేయాలని పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేశారు. ఈ ప్రెస్ మీట్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య మా5పాడుతూ ఈ కార్యక్రమంలో వీరితో పాటు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘ అధ్యక్షులు కొత్తా సీతారాములు, సయ్యద్ గౌస్,పుచ్చకాయల వీరభద్రం, బొడ్డు బొందయ్య, రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ కుమార్, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు భానోత్ వినోద, రేఖా భార్గవి, సుకన్య తదితర నాయకులు పాల్గొన్నారు.

# బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో

## ఘనంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు





**బోనకల్, కెరటం న్యూస్:** 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక యోగా అవగాహన మరియు ఆరోగ్య శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ యోగా గురువు ఆత్మకూరి నాగేశ్వరరావు విద్యార్థినీ, విద్యార్థులకు యోగాసనాలు, ప్రాణాయామాలు, ధ్యానం (మెడిటేషన్), ఒత్తిడి నిర్వహణ, కెరీర్ గైడెన్స్ మరియు ఆరోగ్యకర జీవనశైలిపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించి లక్ష్యాలను సాధించాలంటే యోగా, ప్రాణాయామం మరియు ధ్యానం వంటి సాధనలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. యోగా ద్వారా శారీరక ఆరోగ్యం మాత్రమే కాకుండా మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని వివరించారు. అలాగే మధుమేహం, రక్తపోటు, ఊబకాయం వంటి జీవనశైలి సంబంధిత వ్యాధులను నియంత్రించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు తమ దినచర్యలో కనీసం 30 నిమిషాలు యోగ సాధనకు కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో యోగాసనాల ప్రదర్శనతో పాటు ప్రాణాయామ సాధన, ధ్యాన విధానాలను ప్రత్యక్షంగా నేర్పించి విద్యార్థులతో సాధన చేయించారు. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని యోగా ప్రయోజనాలను తెలుసుకొని ప్రతిరోజూ యోగాసనాలు చేస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటామని సంకల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గారితో పాటు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులలో ఆరోగ్య చైతన్యం, సానుకూల ఆలోచన మరియు క్రమశిక్షణ పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని వారు అభిప్రాయపడ్డారు. కాగా, యోగా గురువు ఆత్మకూరి నాగేశ్వరరావు గత సంవత్సరం కూడా ఇదే కళాశాలలో యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా, ఈ సంవత్సరం కూడా ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ విద్యార్థులకు విలువైన మార్గదర్శకత్వం అందించడం విశేషం. "యోగం ఆరోగ్యానికి, ఆత్మవిశ్వాసానికి, విజయవంతమైన భవిష్యత్తుకు బలమైన పునాది" అని నాగేశ్వరరావు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# భారతదేశ భవిష్యత్తు నేటి 'జెన్ జీ' యువత చేతుల్లోనే ఉందని, సాంకేతికతను సామాజిక బాధ్యతతో ముడిపెట్టి యువత

## వికసిత్ భారత్ సాకారంలో యువత కీలకం : ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి






**పటాన్ చెరు, 20 జూన్ (కెరటం న్యూస్):** భారతదేశ భవిష్యత్తు నేటి 'జెన్ జీ' యువత చేతుల్లోనే ఉందని, సాంకేతికతను సామాజిక బాధ్యతతో ముడిపెట్టి యువత దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. శనివారం సంగారెడ్డి లో 'నమో జెన్ జీ' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.. డా. ఎపిజె అబ్దుల్ కలాం స్ఫూర్తిమంతమైన మాటలను స్ఫూర్తి గా తీసుకొని యువత కేవలం ఉద్యోగాలు వెతుక్కునే వారిగా మిగిలిపోకూడదని, ఉద్యోగాలు సృష్టించే వారిగా మారాలన్నారు. విలక్షణంగా ఆలోచించే ధైర్యం, సరికొత్త ఆవిష్కరణలు చేసే సాహసమే యువతకు నిజమైన ఆభరణాలని ఆయన పేర్కొన్నారు. జెన్ జీ యువతకు చిన్న వయసులోనే పెట్టుబడులు, మ్యూచువల్ ఫండ్స్, మరియు ఫైనాన్షియల్ ప్లానింగ్ పట్ల అద్భుతమైన అవగాహన ఉండడం శుభపరిణామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన డిజిటల్ పేమెంట్ విప్లవం ఈ తరం చేతుల్లోనే నడుస్తోందని, దీనిని యువత మరింత ఆర్థిక క్రమశిక్షణ కోసం వాడుకోవాలని సూచించారు. అదేవిధంగా, పోటీ ప్రపంచంలో ఒత్తిడిని జయించేందుకు యోగా, ధ్యానాన్ని ఆయుధాలుగా మలచుకోవాలన్నారు. మానసిక ఆరోగ్యం పట్ల ఈ తరానికి స్పష్టమైన అవగాహన ఉండాలని, మానసికంగా దృఢమైన యువతే అన్ని రంగాల్లో అద్భుత విజయాలు సాధించగలుగుతుందని స్పష్టం చేశారు. యువత 'ఫిట్ ఇండియా', 'ఖేలో ఇండియా' స్ఫూర్తితో క్రీడల్లో రాణిస్తూ.. లీడర్‌షిప్ క్వాలిటీస్ పెంచుకోవాలని కోరారు. ఆన్‌లైన్ ప్రపంచంలో పెరిగిన సైబర్ మోసాలు, ఫేక్ న్యూస్ పట్ల యువత ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సాంకేతికతను సమాజాన్ని విచ్ఛిన్నం చేయడానికి కాకుండా సమాజ శ్రేయస్సు కోసమే వాడాలన్నారు. సోషల్ మీడియాను కేవలం వినోదానికే కాక.. సామాజిక చైతన్యానికి, దేశభక్తికి వేదికగా మార్చాలని పిలుపునిచ్చారు. యువత కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా ప్రాక్టికల్ నాలెడ్జ్ కలిగి ఉండాలని, చదువు పూర్తి కాగానే ఉపాధి లేదా ఆవిష్కరణల దిశగా ముందుకు వెళ్లే అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. సనాతన విలువలను ఆధునిక సాంకేతికతతో ముడిపెట్టి ప్రపంచానికి చాటిచెప్పే సత్తా జెన్ జీ యువతకే ఉందని ఆయన కొనియాడారు. మన మూలాలను మరువకుండా ముందుకు సాగే యువ నాయకత్వానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. పర్యావరణ పరిరక్షణ, హరిత జీవనశైలిని అలవర్చుకుంటూ ప్రకృతిని కాపాడటంలో యువతే ముందుండాలన్నారు. వార్డు, గ్రామ, మున్సిపల్ అభివృద్ధి పనుల్లో యువత భాగస్వామ్యం పెరగాలని, ప్రజా సమస్యలపై గళమెత్తడం ద్వారానే నిజమైన ప్రజాస్వామ్య బలోపేతం సాధ్యమని స్పష్టం చేశారు. జెన్ జీ యువత కేవలం ఓటర్లుగానే కాదు.. రేపటి పాలకులుగా బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధం కావాలన్నారు. "కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి" అనే అబ్దుల్ కలాం ఆశయాలను గుండెల్లో నింపుకుని, దేశ ప్రధాని నరేంద్ర మోదీ "సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా ప్రయాస్" అనే నినాదంతో నేటి జెన్ జీ యువత సరికొత్త 'వికసిత్ భారత్' నిర్మాణానికి నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వర్ దేశ్ పాండే, బీజేవైఎం రాష్ట్ర ట్రెజరరీ నరేన్ దేశ్ పాండే, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్ రావు తదితరులు ఉన్నారు.

# మద్దిరాలలో స్వర్ణ ఫర్టిలైజర్ షాప్ లైసెన్స్ రద్దు



**సూర్యాపేట, 20 జూన్ (కెరటం న్యూస్):** జిల్లా కలెక్టర్ ఆదేశాల మెరుకు, జిల్లా వ్యవసాయా అధికారి శ్రీధర్ రెడ్డి, తుంగతుర్తి ఏడిఏ రమేష్ బాబు మరియు మండల వ్యవసాయ అధికారిని, మద్దిరాల మండలంలో ని స్వర్ణ ఫర్టిలైజర్ పేష్టిసిడ్స్ షాప్ ని తనిఖీ చేసారు. అధిక ధర కు యూరియా విక్రయించు నందు స్వర్ణ ఫర్టిలైజర్, పేష్టిసిడ్స్ షాప్ లైసెన్స్ ను సస్పెండ్ చేయడం జరిగింది. ఫర్టిలైజర్ డీలర్స్ ఎవరైనా, రైతుల నుంచి అధిక ధరలు విక్రయిస్తే వారి పై చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో రైతులకు సరిపడా యూరియా ను అందజేయడానికి, ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేసింది.సూర్యాపేట జిల్లాలో 18,845 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉంది మరియు వాగన్ ల ద్వారా రోడ్ మూవ్మెంట్ ద్వారా యూరియా నిరంతరం సరఫరా అవుతుంది.కాబట్టి రైతులు ఎవరు ఆందోళన చెందవద్దు అవసరం మేరకు, మాత్రమే యూరియా ని కొనుగోలు చేయాలి. రైతులకు సరిపడా యూరియా అందించడానికి ప్రభుత్వం అన్ని రకాల చెర్యలు తీసుకుంటుంది. ఫర్టిలైజర్ బుకింగ్ అప్ ద్వారా రైతులు విడతల వారీగా యూరియా బుక్ చేసుకొని తీసుకెళ్ళాలని తెలియజేసారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పై మధిర నియోజకవర్గంలో సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్.



**ఖమ్మం, 20 జూన్ (కెరటం న్యూస్):** చింతకాని మండలంలో ఈనెల 28, 29, 30 తేదీల్లో రైతుమేళా నిర్వహించనున్నట్లు, అట్టి రైతు మేళా లో ఈ నెల 30 న ముఖ్యమంత్రి ముఖ్య అతిధిగా పాల్గొన్నే సభ ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మూడురోజుల పాటు నిర్వహించే రైతు మేళా, ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. రైతు మేళా విజయవంతానికి పకడ్బందీ ప్రణాళిక, సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో కార్యచరణ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ మాట్లాడుతూ, ఈనెల 28, 29, 30 తేదీల్లో మధిర నియోజకవర్గం చింతకాని మండలంలో రైతు మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.150 స్టాల్స్ ఏర్పాటు చేసే ఈమేళాకు జిల్లా నుండి రైతులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని వ్యవసాయాన్ని పండుగలా మార్చుకోవాలని,

ఈ అవకాశాన్ని అన్న దాతలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. శాస్త్రవేత్తలు రైతు మేళాలో పాల్గొననున్నందున వారికి బస, రవాణా ఏర్పాట్లు చేయాలన్నారు. రైతు మేళాకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్డీవో శ్రీరామ్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా.పురందర్, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, జిల్లా మత్స్య శాఖ అధికారి మల్లేశం, పి.డి మెప్మా, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శృతి విస్తృత పర్యటన

## పురాతన ఆలయాల సందర్శ,బాలల గ్రామసభలో పాల్గొనడం




**గీసుకొండ, 20 జూన్ (కెరటం న్యూస్):** మండల పరిషత్ అభివృద్ధి అధికారి విధులు, బాధ్యతలపై శిక్షణలో భాగంగా గీసుకొండ మండలానికి వచ్చిన ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎన్. శృతి శనివారం పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. శాయంపేట హవేలీ గ్రామంలోని పాంచాలరాయుడి ఆలయం, కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం విశ్వనాధపురం గ్రామపంచాయతీలో నిర్వహించిన బాలల గ్రామసభకు హాజరై విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. గ్రామీణ పరిపాలన, బాలల హక్కులు, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రామాచార్యులు, కొండపాక నాగరాజుతో పాటు స్థానిక సర్పంచ్ కన్నెబోయిన యమునా ప్రవీణ్, ధారావత్ జ్యోతి తిరుపతి, గాలి యాకయ్య పంచాయతీ కార్యదర్శులు మురళీకృష్ణ, శ్రీధర్, సునీల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో దుక్కిటెద్దు మృతి



**పెద్ద వంగర , 20 జూన్ (కెరటం న్యూస్):** మండలం చిట్యాల గ్రామం లో ఎండీ వాలీబాషా రైతు దుక్కిటేద్దు మృతి చెందిన ఘటన రైతు కుటుంబంలో విషాదం నింపింది వివరాల్లోకి వెళితే శనివారం ఉదయం తన వ్యవసాయ క్షేత్రంలో నారుమడి దున్నుతుండగా పొలములో ఉన్న కరెంటు స్తంభం స్టే వైరు కు ఎటువంటి రక్షణ లేకపోవడంతో విద్యుత్ సరఫరా జరిగి ఎద్దు కరెంటు షాక్ కు గురై అక్కడికక్కడే మృతి చెందింది రైతు ఎద్దును కాపాడడానికి వెళ్ళడానికి ప్రయత్నించి రైతుకు విద్యుత్ ఘాతం తగలడంతో వెంటనే అక్కడి నుంచి దూరంగా జరిగి ప్రాణాలతో బయటపడ్డాడు స్తంభముకు ఉన్నటువంటి స్టే వైరు ఆ వైరుకు ఎగ్ ఇన్సులేటర్ పెట్టకపోవడంతో కరెంటు ప్రవహించి ఎద్దు చనిపోవడం జరిగింది ఇది కరెంటు అధికారుల వల్ల నిర్లక్ష్యమే కారణమని పక్క రైతులు తెలిపారు . ఇప్పటికైనా విద్యుత్ వైర్లను సక్రమంగా అమర్చి రైతులు పశువుల ప్రాణాలు కాపాడాలని విజ్ఞప్తి చేశారు అదేవిధంగా రైతు వలి భాషకు ప్రభుత్వం తరఫున నష్టపరిహారాన్ని అందించాలి అని రైతు వేడుకుంటున్నాడు.